
శాన్‌ఫ్రాన్సిస్కో భారత రాయబార కార్యాలయంలో సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ దంపతులు, అధికారులు

పరిశ్రమల వెల్లువ

ముందుకు వచ్చిన ఎనిమిది ప్రముఖ కంపెనీలు - రూ.1300 కోట్ల పెట్టుబడులు: సీఎం స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమెరికా పర్యటనలో ఇప్పటి వరకూ రూ.1300 కోట్ల మేర పెట్టుబడులు సాధించినట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో తన పర్యటన ముగియడంతో అక్కడి భారత రాయబార కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో స్టాలిన్, ఆయన సతీమణి దుర్గాస్టాలిన్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, భారత రాయబారి శ్రీకర్ రెడ్డి, వాణిజ్య శాఖ కార్యదర్శి అరుణ్‌రాయ్, ప్రవాసతమిళుల సంస్థ అధ్యక్షుడు కార్తికేయ శివసేనాపతి, ఫ్రీమాండ్ నగర కౌన్సిల్ మెంబర్ రాజ్ సల్వాన్, సన్నివేల్ నగర డిప్యూటీ మేయర్ మురళీ శీనివాసన్, కుబెర్టినో మేయర్ షీలా మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఆ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ముఖ్యమంత్రి దంపతులు ఆసక్తిగా తిలకించారు. ఈ సమావేశం అనంతరం స్టాలిన్ తన ఎక్స్ పేజీలో ఓ సందేశం వెలువరిస్తూ పారిశ్రామిక పెట్టుబడుల సమీకరణ కోసం ఈ నెల 28 నుంచి చేస్తున్న తన అమెరికా పర్యటనలో ప్రవాస తమిళులంతా కలుసుకోవడానికి వస్తుండటం చూసి ఆశ్చర్యపోయానని, వీరి సందడితో చెన్నై నగరంలోనే ఉన్నామనే భావన కలిగిందన్నారు. తమిళులు ఎక్కడ ఉన్నా తమ మాతృభూమిపై మమకారాన్ని కలిగి ఉంటారని తన పర్యటన రుజువు చేస్తోందన్నారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు, వాణిజ్య కలపాలను విస్తరింపజేసేందుకు అమెరికాకు చెందిన ఎనిమిది ప్రముఖ కంపెనీలు ముందుకువచ్చాయని, తన సమక్షంలో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయని తెలిపారు.

షికాగో బయల్దేరిన సీఎం..

ముఖ్యమంత్రి స్టాలిన్ శాన్‌ఫ్రాన్సిస్కో పర్యటన ముగించుకుని సోమవారం షికాగో నగరానికి పయనమయ్యారు. ఆ నగరంలో వివిధ కంపెనీలకు చెందిన పారిశ్రామిక వేత్తలు, ప్రతినిధులతో ఆయన సమావేశం కానున్నారు. ఆ సందర్భంగా కొన్ని కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. తరువాత షికాగోలో నివసిస్తున్న ప్రవాస తమిళులతో సమావేశమవుతారు. ఈ నెల 12 వరకు ముఖ్యమంత్రి షికాగో నగరంలోనే బసచేయనున్నారు.


డ్రైవర్ రహిత కారులో స్టాలిన్

● అమెరికాలో సాగుతున్న సీఎం పర్యటన



పెరంబూర్, సెప్టెంబరు 2: అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ డ్రైవర్ రహిత ఆటోమేటిక్ కారులో ప్రయాణించారు. జాగ్వర్ సంస్థకు చెందిన ఈ కారులో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రయాణించే దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులు ఆహ్వానించేందుకు సీఎం స్టాలిన్ అమెరికాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే.

హరోం హర.. మురుగయ్యా...


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, (ఇన్‌సెట్)లో వళ్లీదేవసేన సమేత సెంథిల్ ఆండవర్

తిరుచెందూరులో నేత్రపర్వంగా రథోత్సవం

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవం సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో రెండవది, శత్రుసంహార క్షేత్రంగా భాసిల్లుతున్న తిరుచెందూరు సెంథిల్‌ఆండవర్ ఆలయంలో ఆవణి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. 12 రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు ఆగస్టు 24న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. 30న స్వామి షణ్ముగనాథుడు వళ్ళి, దేవసేన సమేతుడై స్వర్ణ సప్పరంలో ఊరేగారు. ఈ ఉత్సవాల్లో కీలకఘట్టమైన రథోత్సవం సోమవారం ఉదయం ప్రారంభమైంది. వేకువజాము నాలుగు గంటలకు సుప్రభాత సేవ, 4.30 గంటలకు విశ్వరూపదర్శనం, 6 గంటలకు ఉదయ మార్తాండ అభిషేకం నిర్వహించారు. 6.30 గంటలకు గణపతి రథమండప ప్రాంతం నుండి బయలుదేరి నాలుగు వీధుల్లో ఊరేగి తిరిగొచ్చారు. ఉదయం 7.10 గంటలకు స్వామి కుమారవిడంగ పెరుమాల్ వళ్లి, దేవసేన సమేతుడై రథంపై ఏర్పాటు చేసిన ప్రత్యేకపీఠంపై ఆశీనులవగా రథం బయలుదేరింది. ఈ రథోత్సవాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్ జ్ఞానశేఖరన్ ప్రారంభించారు. రథానికి ముందు ఆలయ గజం నడచి రాగా స్వామివారిని స్వాగతించేలా కళాకారులు పంచవాయిద్యాలను మోగించారు. భక్తులు రథం మోకుతాళ్లను పట్టుకుని లాగుతూ 'హరోం హరా మురుగయ్యా... సెంథిల్ ఆండవా పోట్రి' అంటూ భక్తి ప్రపత్తుల నడుమ నినాదాలు చేశారు. రథారూఢులై వేంచేస్తున్న సర్వాలంకరణ శోభిత సెంథిల్ ఆండవర్ స్వామివారిని భక్తులు దర్శించారు. ఆ తర్వాత వళ్ళియమ్మన్ రథం నాలుగు వీధుల్లో ఊరేగి తిరిగొచ్చింది. ఈ వేడుకలలో తూత్తుకుడి, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రమైన కేరళ నుండి కూడా వేల సంఖ్యలో భక్తులు వచ్చారు. ఆలయ సూపరింటెండెంట్లు వేల్ మురుగన్, అజిత్, ముత్తుమారి, రిటైర్డ్ వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బాలసుబ్రమణ్య ఆదిత్తన్, రాధాకృష్ణ ఆదిత్తన్, తంగేశ ఆదిత్తన్, ట్రస్టుబోర్డు సభ్యులు రామ్‌దాస్, కుమారరామసామి ఆదిత్తన్, బాలమురుగన్ ఆదిత్తన్, వరదరాజ ఆదిత్తన్, వైదీశ్వరన్ ఆదిత్తన్, షణ్ముగనాథ ఆదిత్తన్, మురళీకాంత్ ఆదిత్తన్ తదితరులు పాల్గొన్నారు. ఈ రథోత్సవంలో డీఎస్పీ వసంత రాజ్ నాయకత్వంలో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు.


తిరుచెందూరు ప్రధాన రహదారిలో ఊరేగుతున్న రథం

11 శాఖల సహకారంతో డెంగ్యూ నిరోధం

● మంత్రి సుబ్రమణ్యం


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డెంగ్యూ జ్వరాల వ్యాప్తిని నిరోధించేందుకు 11 శాఖలు సమష్టిగా పని చేసి చర్యలు చేపడతాయని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. నగరంలో సోమవారం ఉదయం డెంగ్యూ జ్వరాలను నిరోధించేందుకు చేపట్టాల్సిన చర్యలు గురించి చర్చిండానికి ఆరోగ్యశాఖ సహా 11 శాఖలకు చెందిన అధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఇప్పటి వరకు 11,743 మంది డెంగ్యూ జ్వరాలతో అస్వస్థతకు గురయ్యారని, ఈ జ్వరాలకు మృతుల శాతం బాగా తగ్గిందని, ఈ యేడాది ఇప్పటివరకూ నలుగురు మాత్రమే మరణించారని తెలిపారు. ఇంతకు ముందు 2012లో 66 మంది, 2017లో 65 మంది డెంగ్యూ జ్వరాలకు మృతి చెందారని, డీఎంకే ప్రభుత్వం గత మూడేళ్లుగా డెంగ్యూ జ్వరాలను నిరోధించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టడంతో మృతుల సంఖ్య బాగా తగ్గిందన్నారు. వర్షాకాలంలో వ్యాపించే విరేచనాలు, టైఫాయిడ్, పచ్చకామెర్లు, రేట్ ఫీవర్, స్వైన్ ఫ్లూ తదితర అంటు వ్యాధులను నిరోధించడానికి 4,676 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు సంయుక్తంగా పరిశీలిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెంగ్యూ జ్వర బాధితుల చికిత్సకు అవసరమైన మందులున్నాయని, పరీక్ష పరికరాలు కూడా అవసరమైనంతమేరకు అందుబాటులో ఉంచామని చెప్పారు. దోమల ఉత్పత్తిని నిరోధానికి కూడా చర్యలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

భారీ వర్షాల ఎఫెక్ట్....

పలు రైళ్ల రద్దు

● సెంట్రల్, ఎగ్మూర్ స్టేషన్లలో ఉత్తరాది ప్రయాణికుల తీవ్ర అవస్థలు


సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల పడిగాపులు



స్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

పార్రీస్, సెప్టెంబరు 2: తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీవర్షాల కారణంగా రాజధాని నగరం చెన్నై నుంచి వెళ్లాల్సిన 18 ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దుచేయడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డా.ఎంజీఆర్ సెంట్రల్, ఎగ్మూర్, తాంబరం రైల్వే స్టేషన్ల నుంచి వెళ్లాల్సిన రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే సోమవారం ప్రకటించింది. దీంతో, ఆ రైళ్లలో వెళ్లాల్సిన వేలాదిమంది ప్రయాణికులు రైల్వేస్టేషన్లలోనే పడిగాపులు కాస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో రైలుపట్టాలపై వర్షపు నీరు చేరడంతో పలు మార్గాల్లో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో సెంట్రల్-పూరి, అహ్మదాబాద్-సెంట్రల్ నవజీవన్ ఎక్స్‌ప్రెస్, సెంట్రల్-షాలిమార్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లను పూర్తిగా రద్దు చేశారు. మైసూరు-హౌరా, హౌరా-మైసూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-తాంబరం, సెంట్రల్-చాప్రా గంగాకావేరి ఎక్స్‌ప్రెస్, చాప్రా-సెంట్రల్ సహా 18 రైళ్లు రద్దయ్యాయి. విజయవాడ, రాజమండ్రి, ఒంగోలు, తెనాలి, నెల్లూరు, గూడూరు, గుడివాడ, గుంటూరు, హైదరాబాద్, సికింద్రాబాద్ తదితర 18 రైల్వేస్టేషన్లతో సంప్రదించేందుకు వీలుగా సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక సమాచార కేంద్రం ఏర్పాటుచేశారు. 044-25354995, 25354151 అనే టోల్ ఫ్రీ నెంబర్లు కూడా విడుదల చేశారు. రద్దయిన రైళ్ల ప్రకటన విడుదల కావడంతో సంబంధిత రైళ్లలో టిక్కెట్లు రిజర్వ్ చేసుకున్న ప్రయాణికులు, ఆర్డినరీ బోగీల్లో వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రైళ్ల రద్దు, ఆలస్యం తదితర సమాచారం తెలుసుకొనేందుకు క్యూ ఆర్ కోడ్ సదుపాయనిన్ని సెంట్రల్ రైల్వేస్టేషన్ ప్రవేశద్వారం వద్ద ఏర్పాటుచేశారు. సెంట్రల్-ఢిల్లీ జీటీ ఎక్స్‌ప్రెస్, తాంబరం-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్, సెంట్రల్-ఢిల్లీ తమిళనాడు ఎక్స్‌ప్రెస్, కాకినాడ-బెంగళూరు శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 4వ తేది వరకు రద్దుచేశారు.



రద్దయిన రైళ్ల వివరాల క్యూ ఆర్ కోడ్ ఫొటో తీస్తున్న ప్రయాణికుడు

టీవీకే మహానాడు అనుమతి వ్యవహారం...

బుస్సీ ఆనంద్‌కు నోటీసు


టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, అధ్యక్షుడు విజయ్

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపంలో సినీనటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) తొలి మహానాడుకు అనుమతి ఇచ్చే విషయమై పోలీసులు 21 ప్రశ్నలతో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్‌కు నోటీసు పంపించారు. అందులోని ప్రశ్నలకు సమాధానాలు అందగానే పరిశీలించి మహానాడుకు అనుమతిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 23న విక్రవాండి సమీపంలోని 85 ఎకరాల్లో విజయ్ పార్టీ తొలిమహానాడు నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఆ మేరకు మహానాడుకు అనుమతి మంజూరు చేసి, భద్రత కల్పించాలని బుస్సీ ఆనంద్ ఇటీవల విల్లుపురం ఎస్పీ కార్యాలయంలో, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాలు సమర్పించారు. ఆ వినతి పత్రాలు ఇచ్చి ఆరు రోజులైనా పోలీసుల నుండి ఎలాంటి సమాచారం రాకపోవడంతో విజయ్ పార్టీ శ్రేణులు ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో విల్లుపురం డీఎస్పీ సురేష్ మహానాడు జరుగనున్న ప్రాంతంలో వేదిక ఎంత పొడవు, వెడల్పుతో నిర్మిస్తారు? ఏయే నగరాల నుంచి ఎంతమంది వస్తారని అంచనా వేస్తున్నారు? వాహనాల పార్కింగ్‌కు ఏయే స్థలాలను ఎంపిక చేశారు? మహానాడు జరిగే స్థలాన్ని అద్దెకు తీసుకోవటానికి ఎంతమంది అనుమతిచ్చారు? వంటి వివిధ అంశాలతో పోలీసులు 21 ప్రశ్నలడిగారు. ఈ నోటీసును డీఎస్పీ సురేషన్ విక్రవాండి ఎస్‌ఐ ద్వారా తమిళగ వెట్రికళగం ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్‌కు పంపారు. ఆ నోటీసులో అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చిన తర్వాత పోలీసులు మహానాడుకు అనుమతిస్తారని తెలుస్తోంది.

23నే మహానాడు...

తమిళగ వెట్రి కళగం తొలి మహానాడు విక్రవాండిలో ఈ నెల 23నే జరుగుతుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ స్పష్టం చేశారు. ఆగస్టు 28న మహానాడుకు అనుమతి కోరుతూ పోలీసులకు దరఖాస్తు చేసుకున్నామని, ఆ మేరకు విల్లుపురం జిల్లా పోలీసు ఉన్నతాధికారులు మహానాడు జరుగనున్న ప్రాంతాన్ని కూడా పరిశీలించారని చెప్పారు. విక్రవాండి సమీపం చెన్నై - తిరుచ్చి జాతీయ రహదారిలోని 'సాలై' అనే చోట 85 ఎకరాల మైదానంలో మహానాడు జరుగుతుందన్నారు. మహానాడు కోసం భారీ పందిరి నిర్మిస్తున్నామని, అంబులెన్స్ , మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం కల్పిస్తున్నామని ఆయన వివరించారు. ఒకచోట 40 ఎకరాల్లో, మరోచోట 27 ఎకరాల్లో వాహనాల పార్కింగ్ ప్రాంతాన్ని సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. న్యాయనిపుణులతో సంప్రదించిన తర్వాత పోలీసులు అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానాలు తెలియజేస్తామని బుస్సీ ఆనంద్ తెలిపారు.

లైంగిక వేధింపులపై

ఉక్కుపాదం

● కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ ఉన్నత స్థాయి సమీక్ష

అడయార్, సెప్టెంబరు 2: విద్యా సంస్థల్లో (పాఠశాలలు) జరుగుతున్న లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేసే విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం అధ్యక్షతన సోమవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొన్నారు. కృష్ణగిరి జిల్లాలోని ఓ పాఠశాలలో నకిలీ ఎన్‌సీసీ క్యాంపు ఓ రాజకీయ పార్టీకి చెందిన నేతకు సంబంధం ఉన్నట్టు ఆరోపణలు రావడంతో ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ వ్యక్తి పలువురు విద్యార్థినుల జీవితాలతో చెలగాటమాడినట్టు వార్తలు వస్తున్నాయి. పోలీసుల దర్యాప్తులో ఈ విషయాలన్నీ వెలుగులోకి వస్తాయని భయపడి బలవన్మరణానికి పాల్పడివుంటారని పోలీసులు భావిస్తున్నారు. అలాగే, కొన్ని నెలల క్రితం తంజావూరు జిల్లాలోని తిరువిడైమరుదూరు తాలూకాలో ఓ గ్రామంలో గవర్నమెంట్ టీచర్ తమిళరసన్ తన వద్ద చదువుకునే విద్యార్థిపై అత్యాచారానికి పాల్పడంతో ఆయనపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అలాగే, కోవైలోని ఓ విద్యా సంస్థలో బాలికపై జరిగిన లైంగికదాడి కేసులో ఏడుగురు టీచర్లపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇలా వరుస సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో వీటికి అడ్డుకట్ట వేసే విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొన్నారు. పాఠశాలల్లో లైంగిక నేరాలు, దాడులు జరుగకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలి? ఒక వేళ జరిగితే దానిపై ఎలా స్పందించాలి? ఎలాంటి చర్యలు తీసుకోవాలి? ఫిర్యాదు వచ్చిన వెంటనే తీసుకోవాల్సిన చర్యలు? ఇలాంటి కేసుల్లో నిందితులు తప్పించుకోకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి? తదితర అంశాలపై చర్చించారు. అలాగే, ప్రస్తుతం అన్ని పాఠశాలలు తెరిచివున్న నేపథ్యంలో ఈ తరహా కేసుల్లో ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నట్టుగానే, లైంగికదాడులు జరగకముందే ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న విషయంపై కూడా ఇందులో చర్చించగా, పలువురు ఉన్నతాధికారులు తమతమ అభిప్రాయాలను వెల్లడించారు.


చెన్నైలోని పార్టీ కార్యాలయం కమలాలయంలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్న ఆ పార్టీ తమిళనాడు, కర్ణాటక కో ఇంఛార్జి డాక్టర్ పొంగులేటి సుధాకరరెడ్డి, చిత్రంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల కన్వీనర్ హెచ్.రాజా, రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు డాక్టర్ తమిళ సై సౌందర్ రాజన్ తదితరులు

సమాచార ధ్వని

గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాల విడుదల

పెరంబూర్, సెప్టెంబరు 2: గ్రూప్-1 ప్రిమిలినరీ పరీక్షా ఫలితాలను టీఎన్‌పీఎస్సీ సోమవారం విడుదల చేసింది. సబ్ కలెక్టర్, డీఎస్పీ సహా పలు శాఖలకు సంబంధించిన 90 పోస్టుల భర్తీకి మార్చి 28వ తేది టీఎన్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. జూలై 13వ తేది నిర్వహించిన రాతపరీక్షకు 1.59 లక్షల మంది హాజరయ్యారు. ఈ పరీక్షా ఫలితాలు సోమవారం https://www.tn-psc.gov.in/english/latest_result.aspx అనే వెబ్‌సైట్‌లో విడుదలయ్యాయి. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారు డిసెంబరు 10 నుంచి 13వ వరకు జరిగే మెయిన్స్‌లో పాల్గొంటారని టీఎన్‌పీఎస్సీ తెలియజేసింది.

6న జీసీసీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 2: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేది విద్యార్థులకు క్విజ్ పోటీలు జరుగనున్నాయి. చెన్నై అండ్ తిరుక్కురల్ అనే శీర్షికన నిర్వహించే ఈ పోటీల్లో 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు పాల్గొనవచ్చు. ఒక్కో పాఠశాల నుంచి రెండుజట్లు నమోదుచేసుకోవాలి. మొదటి బహుమతిగా రూ.7,000, రెండోబహుమతి రూ.5,0000, మూడో బహుమతి రూ.3,000, పోటీలో పాల్గొనే అందరికీ సర్టిఫికెట్లు అందజేస్తారు. మూడు విభాగాలుగా మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు https://forms.gle/CiU1WvgQ9j Ywkbhn7 వెబ్‌సైట్‌లో పేరు నమోదుచేసుకోవాలని తెలిపారు.

యధావిధిగా పాస్‌పోర్ట్ వెబ్‌సైట్

పెరంబూర్, సెప్టెంబరు 2: సాంకేతిక నిర్వహణ కోసం పాస్‌పోర్ట్ వెబ్‌సైట్ సేవలు ఈ నెల 29వ తేది రాత్రి 8 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు పనిచేయవని అధికారులు తెలిపారు. ఈ ఐదురోజులు దరఖాస్తుల పరిశీలన, అపాయింట్‌మెంట్ తదితర సేవలు తత్కాలికంగా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో, సాంకేతిక నిర్మహణ ముగియడంతో ఐదు రోజులుగా నిలిచిన పాస్‌పోర్ట్ వెబ్‌సైట్ సేవలు సోమవారం ఉదయం 6 గంటల నుంచి అందుబాటులో ఇచ్చాయి. ఇంటర్వ్యూకు హాజరుకావాల్సిన అభ్యర్థులకు తదుపరి తేదీని వారి ఈ-మెయిల్ ద్వారా తెలియజేసినట్లు పాస్‌పోర్ట్ కార్యాలయం తెలిపింది.

5న రేషన్ ఉద్యోగుల సమ్మె

పెరంబూర్, సెప్టెంబరు 2: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 5వ తేది రేషన్ ఉద్యోగులు సమ్మె చేపట్టనున్నారు. ఈ మేరకు రేషన్ ఉద్యోగుల సంఘాల సమాఖ్య విడుదల చేసిన ప్రకటనలో... రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్న సరుకుల కొలతల్లో తేడాలుంటున్నాయని కానీ, అధికారులు ఇందుకు కారణం దుకాణంలోని సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్ అంటూ వారిపై చర్యలు చేపట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. అన్ని రేషన్ దుకాణాలకు ఒకే సమయంలో సరుకులందించాలని కోరుతూ సమ్మె చేపట్టనున్నట్లు సమాఖ్య ప్రకటనలో తెలిపింది

8 నిమిషాలు ముందే వచ్చిన వందే భారత్

పెరంబూర్, సెప్టెంబరు 2: కరూర్ రైల్వేస్టేషన్‌కు 8 నిమిషాలు ముందుగా వచ్చిన వందే భారత్ రైలు 10 నిమిషాలు స్టేషన్‌లో ఆగింది. మదురై నుంచి బెంగళూరుకు వందే భారత్ రైలు సేవలను గత నెల 31వ తేది ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ రైలు మదురై నుంచి ఉదయం 5.15 గంటలకు బయల్దేరి దిండుగల్, తిరుచ్చి మీదుగా 8 గంటలకు కరూర్ రైల్వేస్టేషన్ చేరుకుంటుంది. కానీ, సోమవారం 8నిమిషాల ముందుగానే కరూర్ చేరుకుంది. దీంతో, అధికారులు 10 నిమిషాలు కరూర్ రైల్వేస్టేషన్‌లోనే నిలిపి యధావిధిగా 8.11 గంటలకు పంపించారు. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... రైలు ముందుగా వచ్చిన ఆ స్టేషన్‌లోనే నిలిపి ప్రకటించిన సమయానికే బయల్దేరి వెళుతుందని తెలిపారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, సెప్టెంబరు 2: నగరంలోని నాలుగు మండలాల్లో మంగళవారం ఉదయం 11గంటల నుంచి విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. మైలాపూర్ మండల పరిధికి చెందిన వారు కోడంబాక్కం హైరోడ్డు మెట్రో తాగునీటి కేంద్ర సమీపంలోని వళ్లువర్‌కోట్టం ఉపవిద్యుత్ కేంద్రం, కేకే నగర్ పరిధికి చెందిన వారు అన్నా మెయిన్ రోడ్డులో ఉన్న కేకేనగర్ ఉపవిద్యుత్ కేంద్ర ప్రాంగణంలోని ఇంజనీర్ కార్యాలయం, అంబత్తూర్ మండల పరిధికి చెందిన వారు అంబత్తూర్ ఎస్టేట్ మూడో మెయిన్ రోడ్డులో ఉన్న ఉపవిద్యుత్ కేంద్ర ఇంజనీర్ కార్యాలయం, తండయార్‌పేట మండల పరిధికి చెందిన వారు టీహెచ్ రోడ్డు క్లాక్ టవర్ ఎదురుగా ఉన్న ఇంజనీర్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌లో పాల్గొని సమస్యలకు పరిష్కారం పొందాలని అధికారులు తెలిపారు.

'నెక్ట్స్'కు మార్గదర్శకాల విడుదల

ఐసిఎఫ్, సెప్టెంబరు 2: ఈ ఏడాది అమలులోకి వచ్చిన 'నెక్ట్స్' మార్గదర్శకాలను జాతీయ వైద్య కమిషన్ విడుదల చేసింది. యూజీ వైద్య కోర్సులైన ఎంబీబీఎస్, బీడీఎస్ చదివేందుకు నీట్ తప్పనిసరి కాగా,అదే విధంగా ఈ కోర్సుల అనంతరం పీజీ కోర్సుల్లో చేరేందుకు నెక్ట్స్ ఉత్తీర్ణత కావాల్సిఉంది. విదేశాల్లో చదువు ముగించుకొని వచ్చిన వారిని సమన్వయపరుస్తూ 'నెక్ట్స్' అనే జాతీయస్థాయి పరీక్ష రెండు విడతలుగా నిర్వహించనున్నారు. ఆ ప్రకారం, ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థులు నెక్ట్స్-1 పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే ట్రైనీ డాక్టర్‌గా కొనసాగేందుకు వీలవుతుంది. అనంతరం నెక్ట్స్-2 పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే పీజీ కోర్సులో చేరేందుకు, వైద్యసేవలు అందించేందుకు వీలవుతుంది. విదేశాల్లో వైద్య కోర్సులు పూర్తిచేసుకున్న వారు భారతదేశంలో వైద్యసేవలు అందించేందుకు నెక్ట్స్-2 పరీక్ష రాయాల్సి ఉంటుంది. గతేడాది ఈ పరీక్ష నిర్వహించాల్సి ఉండగా, కొన్ని కారణాలతో వాయిదాపడగా, ఈ ఏడాది పరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

14న డీఎండీకే ముప్పెరుం విళా

పెరంబూర్, సెప్టెంబరు 2: డీఎండీకే ముప్పెరుం విళా ఈ నెల 14వ తేది అన్ని జిల్లాల్లో నిర్వహించాలని ప్రధాన కార్యదర్శి ప్రేమలత పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రేమలత విడుదల చేసిన ప్రకటనలో... పద్మభూషణ్ పురస్కారం పొందిన దివంగత నేత విజయకాంత్‌కు గౌరవం చేకూర్చేలా, పార్టీ 20వ వార్షికోత్సవం, విజయకాంత్ 72వ జయంతిని సమన్వయం చేసుకొని ముప్పెరుం విళా నిర్వహించాలన్నారు. పోలీసుల అనుమతి పొంది సాయంత్రం అన్ని జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహించి, సంక్షేమ సహాయాలు అందించాలని ప్రేమలత పిలుపునిచ్చారు.

నకిలీ వైద్యుడి అరెస్ట్

ఐసిఎఫ్, సెప్టెంబరు 2: స్థానిక మాధవరంలో 8వ తరగతి చదివి వైద్యం చేస్తున్న నకిలీ డాక్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మాధవరం పొన్నియమ్మన్‌మేడు కృష్ణా నగర్ మొదటి వీధిలో ఎన్నార్కే పేరుతో అరుంబాక్కం ఎంఎండీఏ ప్రాంతానికి చెందిన మణిమారన్ (54) క్లినిక్ నిర్వహిస్తున్నాడు. మూడేళ్లుగా నడుస్తున్న ఈ ఆస్పత్రిపై వివిధ ఫిర్యాదులున్నాయి. మాధవరం వైద్యాధికారులు క్లినిక్‌కు వెళ్లి ఆయన సర్టిఫికేట్ పరిశీలించగా, 8వ తరగతి చదివి నకిలీ ఎంబీబీఎస్ సర్టిఫికెట్లు ఉంచుకొని వైద్యం అందిస్తున్నట్లు గుర్తించారు. అధికారుల ఫిర్యాదుతో పోలీసులు అతనిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

ప్రైవేటు పాఠశాలకు బాంబు బెదిరింపు

పెరంబూర్, సెప్టెంబరు 2: ఈరోడ్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలకు బాంబు బెదిరింపు కలకలం రేపింది. మూలపాలయం సమీపంలో ప్రైవేటు (జేటీఎస్) పాఠశాలలో సుమారు 2,000 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ నేపథ్యంలో, పాఠశాలలో బాంబు ఉంచినట్లు, అది ఏ క్షణంలోనైనా పేలుతుందని ఈ-మెయిల్ వచ్చింది. పాఠశాల నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చి, పాఠశాలకు సోమవారం సెలవు ప్రకటించారు. అప్పటికే పాఠశాలకు వచ్చిన విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లాలని వారి తల్లిదండ్రులకు సెల్‌ఫోన్‌లో మెసేజ్ పంపారు. పాఠశాలలో బాంబు పెట్టారన్న వార్తతో తల్లిదండ్రులు హడావుడిగా పాఠశాలకు వెళ్లి పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. పోలీసులు, బాంబ్ స్క్వాడ్ నిపుణులు అక్కడకు చేరుకొని పాఠశాల, ప్రాంగణాలను క్షుణ్ణంగా పరిశీలించి అది ఫేక్ మెసేజ్‌గా నిర్ధారించి, ఈ-మెయిల్ పంపిన చిరుమానా గురించి విచారిస్తున్నారు.



పాఠశాల నుంచి పిల్లలను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

మైనార్టీ భాషల విద్యార్థులకు తమిళ పరీక్ష తప్పనిసరి

పరీక్ష శాఖ ఆదేశం

పెరంబూర్, సెప్టెంబరు 2: మైనార్టీ భాషల విద్యార్థులు కూడా తమిళ పరీక్ష తప్పక రాయాలని పరీక్ష శాఖ ఉత్తర్వులు జారీచేసింది. అలాగే 10, 11, 12 తరగతుల పబ్లిక్ పరీక్షల విద్యార్థులకు సంబంధించి 13 రకాల వివరాలు సమర్పించాలని ప్రధానోపాధ్యాయులకు పరీక్ష శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో, మైనార్టీ భాషా విద్యార్థులకు తమిళ పరీక్ష నుంచి గత ఏడాది మినహాయింపు కల్పించారు. తెలుగు, కన్నడం, ఉర్దూ, మలయాళం తదితర భాషలు మాతృభాషగా కలిగిన విద్యార్థులు, ఈ ఏడాది తమిళ భాషా పరీక్ష తప్పనిసరిగా రాయాలని పరీక్ష శాఖ ఉత్తర్వులు జారీచేసింది. తమిళం మాతృభాషగా కలిగిన 10వ తరగతి మైనార్టీ విభాగం విద్యార్థులకు కూడా తమిళ పరీక్ష నుంచి గత ఏడాది మినహాయింపు కల్పించారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖలో తమిళ భాష తప్పనిసరి అనే నిబంధన ఉంది. ఆ ప్రకారం రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో తమిళ భాషా పరీక్ష తప్పనిసరి చేశారు. ఈ ఉత్తర్వులు మైనార్టీ విద్యాసంస్థలకు కూడా వర్తిస్తాయి. ఈ నేపథ్యంలో, మైనార్టీ పాఠశాలల విద్యార్థులకు తమిళ భాషా పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని, అందుకు ప్రత్యామ్నాయంగా వారి మాతృభాష పరీక్షకు అనుమతించాలని సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ మేరకు సుప్రీంకోర్టు సడలింపు కల్పించింది. అయినా పరీక్ష శాఖ సోమవారం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. అందులో, మైనార్టీ భాష విద్యార్థులు తమిళ పరీక్ష తప్పనిసరిగా రాయాలని పేర్కొంది. 10, 11, 12 పబ్లిక్ పరీక్షల విద్యార్థులు 13 రకాల వివరాలు సమర్పించాలని ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. 10వ తరగతి విద్యార్థులందరూ తమిళ పాఠ్యాంశం తప్పనిసరిగా రాయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 2: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు తెలిపింది.

అంబత్తూర్: ఐసిఎఫ్ కాలని, సెల్లియమ్మన్ నగర్, గంగై రోడ్డు, కావేరి వీధి, అయ్యపాక్కం, టీఎన్‌హెచ్‌బీ ఫేస్-1,2,3, అయ్యపాక్కం నుంచి తిరువేర్కాడు మెయిన్ రోడ్డు వరకు, అంబత్తూర్ నుంచి అత్తిపట్టు వానగరం రోడ్డు వరకు, అత్తిపట్టు ఏరియా, రోజా వీధి, కుప్పం, కేఎస్సార్ నగర్, వీజీఎన్ శాంతి నగర్, మేల్ అయ్యపాక్కం, చెట్టి వీధి, విజయ నగర్, పంచాయతి నగర్, చెన్నై న్యూ సిటీ, ఈడెన్ అవెన్యూ, అగ్రహారం, దేవి నగర్, చిన్నకోలడి, జ్యోతి నగర్, ఎళిల్ నగర్, అన్నమారు

పోరూర్: మదనంతపురం, కెరుగంబాక్కం, రామాపురం, పోరూర్, కుండ్రత్తూర్ రోడ్డు, కారంబాక్కం, పోరూర్, మౌంట్ పూందమల్లి రోడ్డు, మొగలివాక్కం, మౌలివాక్కం, కొలపాక్కం

ఆర్ఏ పురం: ఆర్ఏ పురం 1 నుంచి 7వ మెయిన్ రోడ్డు వరకు, ఆర్ఏ పురం 1 నుంచి 4 క్రాస్ వీధులు, గ్రీన్‌వేస్ రోడ్డు, బిషప్ గార్డన్, బిషప్ గార్డన్ ఎక్స్‌టెన్షన్, భగీరధి వీధి, విశ్వనాధన్ వీధి, కామరాజర్ రోడ్డు, కో-ఆపరేటివ్ కాలని, శ్రీరామ్ నగర్ నార్త్, సౌత్, వెస్ట్ ఏరియాలు, బోట్ క్లబ్ రోడ్డు, సత్యనారాయణ అవెన్యూ, క్రెసెంట్ అవెన్యూ, ఏబీఎన్ అవెన్యూ, సెయింట్ మేరీస్ రోడ్డు, పడవేట్టమ్మన్ వీధి, టర్న్ బుల్స్ రోడ్డు, పృథ్వీ అవెన్యూ, తిరువేంకటం వీధి, ఆసిన్ వీధి, గణపతి కాలని, సేమియర్స్ రోడ్డు 1వ లైన్, అడయార్ క్లబ్ గేట్ రోడ్డు, బగ్స్ రోడ్డు, ఆర్కే పురం, షణ్ముగపురం, వెంకట్రామన్ వీధి, నార్త్, సెంట్రల్, ఈస్ట్ కేశవ పురం, అన్నై సత్యానగర్ 1 నుంచి 5 వీధులు, అన్నై థెరిస్సానగర్, గోవిందస్వామి నగర్, కట్టబొమ్మన్ వీధి, ఇళంగోవీధి, శృంగేరి మఠం రోడ్డు, వన్నియంపది రోడ్డు

నిబంధనల మేరకే చవితి వేడుకలు



ప్రసంగిస్తున్న తహసీల్దార్ చిత్రాదేవి

వేలూరు, సెప్టెంబరు 2: ప్రభుత్వ నిబంధనలు పాటించి వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని గుడియాత్తం తహసీల్దార్ చిత్రాదేవి సూచిం చారు. తహసీల్దార్ కార్యాలయం లో వినాయక చవితి ఏర్పాట్లపై సోమవారం పలు హిందూ సంఘాల ప్రతినిధులతో తహసీ ల్దార్ సమావేశమయ్యారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు చేపడతా మని తహసీల్దార్ హెచ్చరించారు. సమావేశంలో హిందూ మున్నని నిర్వాహ కులు లోకేష్‌కుమార్, ధరణి ప్రభాకరన్ సహా పలువురు పాల్గొన్నారు.

మహిళా అధికారితో వివాహేతర సంబంధం

● ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

అడయార్, సెప్టెంబరు 2: కళ్ళకుర్చి జిల్లా ఉళుందూరుపేటకు చెందిన బ్యాంకులో పనిచేసే మహిళా అధికారిణితో అక్రమ సంబంధం పెట్టుకున్న కేసులో ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌ను పోలీస్ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. జిల్లాలోని ఓ మహిళ (32) జాతీయ బ్యాంకు బీమా విభాగంలో ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. ఈమెకు ఫీల్డ్ వర్క్ కావడంతో బ్యాంకులో విధులు కంటే బయట ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉండేది. ఈ క్రమంలో గత నెల 21న అనుమానాస్పదంగా హత్యకు గురయ్యారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా ఆమె భర్త అశోక్ ప్రధాన నిందితుడిగా గుర్తించారు. తన భార్యకు తిరునావలూరు పీఎస్ ఎస్ఐ నందగోపాల్, మరక్కాణం పీఎస్ హెడ్ కానిస్టేబుల్ ప్రభాకరన్‌తో పాటు పలువురుతో వివాహేతర సంబంధం ఉందని, అందుకే హత్య చేసినట్టు వెల్లడించారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులు స్పందించి నందగోపాల్, ప్రభాకరన్‌లను సస్పెండ్ చేశారు.

భూకబ్జా కేసులో మాజీ మంత్రి సోదరుడి అరెస్టు



అరెస్టయిన శేఖర్

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరూరు జిల్లాలో రూ.100 కోట్ల విలువైన భూములను కబ్జా చేసిన కేసులో మాజీ మంత్రి సి.విజయభాస్కర్ సోదరుడు శేఖర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కరూరు జిల్లా తోరణక్కల్‌పట్టి, కున్నంపట్టిలో ప్రకాష్ అనే వ్యక్తికి చెందిన రూ.100 కోట్ల విలువైన 22 ఎకరాల కబ్జాపై అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్, ఆయన సోదరుడు శేఖర్ సహా ఏడుగురిపై సీబీసీఐడీ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఈ కేసులో విజయభాస్కర్ బెయిలు కోసం ప్రయత్నించి పరారయ్యారు. ఆ తర్వాత కేరళలో దాగిన ఆయనను పోలీసులు అరెస్టు చేసి తీసుకువచ్చారు. అనంతరం విజయభాస్కర్ సోదరుడు శేఖర్ బెయిలు పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చటంతో సీబీసీఐడీ పోలీసులు ఆయనను అరెస్టు చేశారు.

ఉత్తర చెన్నై అభివృద్ధిపై మంత్రి శేఖర్‌బాబు సమీక్ష



అడయార్, సెప్టెంబరు 2: ఉత్తర చెన్నై అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా, సీఎండీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులపై మంత్రి పీకే శేఖర్ బాబు సమీక్ష చేశారు. సోమవారం జరిగిన ఈ సమావేశంలో సీఎండీఏ అధికారులతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి శేఖర్ బాబు మాట్లాడుతూ, స్టాలిన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉత్తర చెన్నైలో మౌలిక సదుపాయాల కల్పన, మెరుగు కోసం నార్త్ చెన్నై డెవలప్‌మెంట్ ప్రాజెక్టును ప్రారంభించి, సీఎండీఏ ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించినట్టు వెల్లడించారు. ఇందులో భాగంగా రూ.5780 కోట్లతో 225 రకాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే, సీఎండీఏ 28 పనులను రూ.685 కోట్లతో చేపట్టిందన్నారు. ఇతర శాఖలకు సంబంధించిన పనులు కూడా పూర్తి చేసేందుకు వీలుగా సీఎండీఏ తరఫున రూ.613 కోట్లను కేటాయించినట్టు ఆయన వివరించారు.

భూగర్భ డ్రైనేజీ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, సెప్టెంబరు 2: కార్పొరేషన్ పరిధిలోని 1వ మండలం 10వ వార్డులోని గాంగేయనల్లూర్ వేలాలర్ వీధి, 3వ మండలం 45వ వార్డు పారమేడు పెరియార్ నగర్ ప్రాంతాల్లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను సోమవారం కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. డ్రైనేజీ పనులు చేసే సమయంలో గుంతల చుట్టూ తగిన భద్రత చేపట్టడంతో పాటు పనులు పూర్తయిన వెంటనే గుంతలు పూడ్చాలని కలెక్టర్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం కార్పొరేషన్ కోట సమీపంలో ఉన్న చెత్త నుంచి ఎరువు తయారుచేసే కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. అక్కడి నుంచి అదే ప్రాంతంలోని ప్రభుత్వ ఆదిద్రావిడుల సంక్షేమ హాస్టల్‌ను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట కార్పొరేషన్ కమిషనర్ జానకి రవిచంద్రన్, కార్పొరేషన్ ఇంజనీర్ పార్వతి సహా పలువురు అధికారులున్నారు.

ఉన్నత విద్యకు వెళ్లని 1.34 లక్షల ప్లస్ టూ విద్యార్థులు

● సీఎస్ మురుగానందం

ప్యారీస్, సెప్టెంబరు 2: ప్లస్ టూ పాసైన విద్యార్థుల్లో 1,34,00 లక్షల మంది ఈ విద్యా సంవత్సరంలో ఉన్నత విద్యలో చేరేందుకు దరఖాస్తు చేసుకోలేదని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... 'నాన్ ముదల్వన్' పథకాన్ని విజయవంతం చేయడంపై జిల్లా కలెక్టర్లకు సీఎస్ మురుగానందం లేఖ రాశారు. అందులో... 2023-24వ విద్యా సంవత్సరంలో ప్లస్ టూ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్లో 1.34 లక్షల మంది ఉన్నత విద్యలో చేరేందుకు దరఖాస్తు చేసుకోలేదని తెలిపారు. ఇందుకు గల కారణాలు తెలుసుకోవాలని, ముఖ్యంగా ఉన్నత విద్య గురించి విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని, పాసైన విద్యార్థులు ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నారా, అనారోగ్యానికి గురయ్యారా, కళాశాలలకు వెళ్లేందుకు ఎందుకు వెనుకాడుతున్నారు తదితర వివరాలు తెలుసుకోవాలని సీఎస్ కలెక్టర్లకు ఉత్తర్వులు జారీచేశారు. ఆ విద్యార్థులను కలెక్టర్ కార్యాలయాలకు పిలిచి వారికి తమిళనాడు స్కిల్ డెవలప్‌మెంట్ నిర్వహిస్తున్న తక్కువ కాల శిక్షణ గురించి వివరించాలని, అదే విధంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి తెలియజేయాలని, ఈ వివరాలతో తయారుచేసిన నివేదిక ప్రభుత్వానికి సమర్పించాలని సీఎస్ ఆదేశించారు.

ఘనంగా ఎల్లయమ్మన్ ఆలయ వేడుకలు



వేలూరు, సెప్టెంబరు 2: ఆవణి అవమావాస్య సందర్భంగా సోమవారం మండవెల్లిలో ఉన్న ఎల్లయమ్మన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. వేడుకల్లో భాగంగా అమ్మవారికి అభిషేకాలు, విశేష అలంకరణ, దీపారాధనలు, నగర ఊరేగింపు, అంబిళ్ల పోయడం, తదితరాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రముఖులు విశ్వనాథన్, లలిత, తేన్‌మొళి, విజయలక్ష్మి, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

విద్యావిధానంపై గవర్నర్ విమర్శ

● మంత్రి అన్బిల్ మహేష్ ఆగ్రహం



చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానంతో పోల్చుకుంటే రాష్ట్ర విద్యావిధానం నాణ్యత తక్కువగా ఉందంటూ గవర్నర్ ఆర్ఎన్ రవి చేసిన విమర్శలపై పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం నగరంలో కేటీసీటీ పాఠశాలల శతవార్షికోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ రాష్ట్ర విద్యావిధానం లోప భూయిష్టంగా ఉందంటూ విమర్శలు చేయడం గర్హనీయమన్నారు. రాష్ట్ర విద్యావిధానం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించే నూతన విద్యావిధానం కంటే చాలా మెరుగ్గానే ఉందని, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని రకాల పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనే రీతిలో విద్యావిధానం అమలులో ఉందన్నారు. 6 నుండి 12వ తరగతి వరకు ఉన్న పాఠ్యపుస్తకాల నుండే టీఎన్‌పీఎస్సీ పరీక్షలకు ప్రశ్నలు అడుగుతున్నారని, కేంద్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు కూడా ఈ పాఠ్యపుస్తకాలను చదివే ఆ పరీక్షలలో ఉత్తీర్ణులవుతున్నారని తెలిపారు. ఈ విషయం గ్రంథాలయాల్లో చదివే విద్యార్థులను అడిగితే తెలుస్తుందని, గవర్నర్ తనతో పాటు ఏ గ్రంథాలయానికి వచ్చినా ఈ విషయం రుజువవుతుందని మంత్రి పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం పీఎంశ్రీ కొత్త పథకాలను రాష్ట్రంపై బలవంతంగా రుద్దినా కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరుపుతామని, ఆ కమిటీ ప్రతిపాదనలను బట్టే ఆ పథకాలను అంగీకరిస్తామని ఆయన స్పష్టం చేశారు. సీబీఎస్ఈ సిలబస్ కంటే రాష్ట్ర సిలబస్సే మేలైనదని, ఈ విషయంపై కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరిపితే గవర్నర్ ఆ మాట వాస్తవమేనని అంగీకరిస్తారని మంత్రి వ్యాఖ్యానించారు.

తిరుమలలో మాజీ సీఎం ఎడప్పాడి



ఈపీఎస్‌కు స్వాగతం పలుకుతున్న ఓఎస్డీ సత్రేనాయక్

తిరుమల, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళని స్వామి శ్రీవారి దర్శనార్థం సోమవారం తిరుమలకు వచ్చారు. తిరుమలలోని శ్రీకృష్ణ అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ ఓఎస్డీ సత్రేనాయక్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి బస, దర్శన ఏర్పాట్లు చేశారు. పళని స్వామి మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

త్వరలో పురుషవాక్కం-కెల్లీస్ సొరంగం పనులు ప్రారంభం

ఐసిఎఫ్, సెప్టెంబరు 2: స్థానిక పురుషవాక్కం నుంచి కెల్లీస్ వరకు సొరంగ మార్గం పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు మెట్రో రైల్వే అధికారులు తెలిపారు. రెండో విడత మెట్రో రైలు పథకం పనులు మూడు మార్గాల్లో 116 కి.మీ మేర రూ.63,246 కోట్లతో ప్రారంభమయ్యాయి. మూడో మార్గమైన మాధవరం పాల కేంద్రం-కెల్లీస్ వరకు 9 కి.మీ మేర సొరంగ మార్గం పనులను టాటా సంస్థ చేపడుతోంది. ఇందులో భాగంగా పురుషవాక్కం నుంచి కెల్లీస్ వరకు త్వరలో సొరంగం తవ్వే పనులు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

అక్టోబరు నుంచి మదురై-శ్రీలంకకు అదనపు విమానాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 2: మదురై-శ్రీలంక మధ్య అదనపు విమాన సేవలు అక్టోబరు నుంచి ప్రారంభం కానున్నటు విమానాశ్రయ అధికారులు తెలిపారు. శ్రీలంక నుంచి మదురైకు మంగళ, గురువారాలు మినహా వారానికి ఐదు రోజులు శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ విమానాలు నడుపుతోంది. ఈ నేపథ్యంలో, మదురై నుంచి శ్రీలంక వెళ్లే ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండడంతో అక్టోబరు నుంచి వారానికి ఆరు రోజులు విమానాలు నడపాలని నిర్ణయించారు. ఆ ప్రకారం, అక్టోబరు 29 నుంచి మంగళవారాల్లో కూడా శ్రీలంకకు విమాన సేవలు అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు.

సింగపూరు పర్యటనకు మంత్రి దురై మురుగన్

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్ సింగపూర్ బయలుదేరి వెళ్లారు. ముఖ్యమంత్రి స్టాలిన్ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలో దురైమురుగన్ సింగపూరు వెళ్లడం పార్టీ వర్గాల్లో కలకలం రేపింది. ఆదివారం ఉదయం ఆయన చెన్నై నుంచి సింగపూరుకు బయలుదేరి వెళ్లారు. ఈ విషయమై డీఎంకే సీనియర్ నాయకుడొకరు మాట్లాడుతూ మంత్రి దురైమురుగన్ ఆకస్మికంగా సింగపూరుకు బయలుదేరి వెళ్ళలేదని, ముందుగా నిర్ణయించుకున్న ప్రకారమే వైద్య పరీక్షల కోసం ఆయన వెళ్లారని చెప్పారు. సింగపూరు పర్యటన గురించి ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ముందుగానే తెలిపారని చెప్పారు. ఈ నెల 4న ఆయన నగరానికి తిరిగి వస్తారని తెలిపారు.

రూ.33 కోట్లతో పునరావాస కేంద్రాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 2: దివ్యాంగులు, వైద్యసహాయం అవసరమయ్యే స్థితిలో ఉన్న వారి సౌకర్యార్థం కొళత్తూర్, కొండితోపు ప్రాంతాల్లో రూ.33 కోట్లతో పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు సీఎండీఏ అధికారులు తెలిపారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో ఎమ్మెల్యేల కోరిక మేరకు భవన నిర్మాణ పథకాలను సీఎండీఏ చేపడుతోంది. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఇచ్చే సమాచారం ఆధారంగా అధికారులు ఆ ప్రాంతాలకు అవసరమైన సదుపాయాలు సమకూరుస్తున్నారు. ఈ క్రమంలో, పలు ప్రాంతాల్లో దివ్యాంగులు, వైద్యసహాయం అవసరమయ్యే స్థితిలో ఉన్న వారికి పునరావాస కేంద్రాల ఏర్పాటుచేసేందుకు సీఎండీఏ నిర్ణయించింది. కొళత్తూర్, కొండితోపు ప్రాంతాల్లో రెండు పునరావాస కేంద్రాలు నిర్మాణానికి రూ.33 కోట్లు కేటాయించినట్లు సీఎండీఏ తెలియజేసింది.

మెట్రోరైళ్లలో 95.43 లక్షల మంది ప్రయాణం

పెరంబూర్, సెప్టెంబరు 2: నగరంలో మెట్రోరైళ్లలో ఆగస్టు నెలలో 95.43 లక్షల మంది ప్రయాణించారు. ఈ మేరకు సీఎంఆర్ఎల్ విడుదల చేసిన ప్రకటనలో... మెట్రోరైళ్లలో జనవరిలో 84,63,384 మంది, ఫిబ్రవరిలో 86,15,008 మంది, మార్చిలో 86,82,457 మంది, ఏప్రిల్‌లో 80,87,712 మంది, మేలో 84,21,072 మంది, జూన్‌లో 84,33,837 మంది, జూలైలో 95,35,019 మంది, ఆగస్టు నెలలో 95,43,625 మంది ప్రయాణించారు. ఆ నెలల్లో 14వ తేది అధికంగా 3,69,547 మంది ప్రయాణించినట్లు సీఎంఆర్ఎల్ తెలిపింది.

జైలు క్యాంటీన్ పరిశీలించనున్న న్యాయమూర్తి

పెరంబూర్, సెప్టెంబరు 2: పుళల్ కేంద్ర కారాగారంలో ఖైదీల కోసం ఏర్పాటుచేసిన క్యాంటీన్ పనిచేస్తుందా? లేదా అని న్యాయమూర్తి పరిశీలించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. అంబత్తూర్ కోర్టు న్యాయమూర్తి పరిశీలించి నివేదిక అందజేయాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. జైలులో మూసిన క్యాంటీన్ తిరిగి ప్రారంభించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ విచారణ ఖైదీ పక్రుద్దీన్ పిటిషన్ వేశారు. ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 10వ తేదీకి హైకోర్టు వాయిదావేసింది.

అడవి దున్న దాడిలో మహిళ మృతి

ఐసిఎఫ్, సెప్టెంబరు 2: దిండుగల్ జిల్లాలో అడవి దున్న దాడిలో మహిళ మృతిచెందింది. పెరుంపారై సమీపంలో ఉన్న అడలూరు గ్రామానికి చెందిన కరుప్పాయి (58) అనే మహిళ తోటలో పనిచేసేందుకు వెళ్లింది. పొదల నుంచి హఠాత్తుగా బయటకు వచ్చిన అడవి దున్న ఆమెపై దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. చుట్టుపక్కల వారు ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. ఇదే విధంగా, వెల్లికరై గ్రామానికి చెందిన ఆనందన్ అనే కార్మికుడు శనివారం తోటలో ఉన్న సమయంలో అడవి దున్న దాడిలో తీవ్రంగా గాయపడి దిండుగల్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలపై అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టారు.

5,10 కిలోల గ్యాస్ సిలిండర్లపై అవగాహన

ఐసిఎఫ్, సెప్టెంబరు 2: మహిళలు సులభంగా వినియోగించేలా 5,10 కిలోల గ్యాస్ సిలిండర్లపై ఇండియన్ ఆయిల్ సంస్థ అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆదివారం తేనాంపేట గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో వినియోగదారులకు ఇంధన భద్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఓసీ గ్యాస్ ఏజెన్సీ డీలర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ... ఇండియన్ ఆయిల్ సంస్థ పరిచయం చేసిన కాంపోజిట్ గ్యాస్ సిలిండర్ సాధారణ సిలిండర్ల కన్నా తక్కువ బరువుతో పాటు నాణ్యంగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం 5,10 కిలోల బరువులో లభిస్తాయని, దీనిని మహిళలు సులువుగా వినియోగించవచ్చని, వంద శాతం ప్రమాదాలు కూడా అడ్డుకోవచ్చని తెలిపారు. గృహాల్లో గ్యాస్ లీకేజీ ఏర్పడితే 1906 టోల్ ఫ్రీ నెంబరు సంప్రదించాలని సూచించారు.

పంట రుణ లక్ష్యాలు చేరుకొనేలా సహకార శాఖ చర్యలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 2: పంట రుణాల లక్ష్యాలు చేరుకొనేలా సహకార శాఖ చర్యలు చేపడుతోంది. రైతులకు సహకార శాఖ పంట రుణాలు అందజేస్తోంది. ఈ సంవత్సరం రూ.16,000 కోట్ల రుణాలు అందజేయాలని లక్ష్యం పెట్టుకుంది.. తంజావూరు, తిరువారూరు వంటి డెల్టా జిల్లాల్లో కురువై సాగు పూర్తిస్థాయిలో జరుగలేదు. పలు జిల్లాల్లో కరువు, అకాలవర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో నిర్ణయించిన లక్ష్యంలో రూ.5,000 కోట్లు మాత్రమే పంట రుణాలుగా అందజేశారు. ప్రస్తుతం డెల్టా జిల్లాల్లో సంబా సీజన్ ప్రారంభమైంది. నైరుతి రుతుపవన వర్షాలతో పలు జిల్లాల్లో డ్యాంలు, జలాశయాలు నిండుతున్నాయి. దీంతో రైతులు సాగుపై దృష్టి సారిస్తున్నారు. పంట రుణాల కోసం సహకార బ్యాంకులకు రైతులు రావడం పెరిగింది. అర్హులైన వారికి రుణాలు అందజేసి లక్ష్యాలు పూర్తిచేసేలా అధికారులు శ్రద్ధ చూపాలని సహకార శాఖ ఆదేశించింది.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి



మృతుడు సెల్వకుమార్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, సెప్టెంబరు 2: తిరువణ్ణామలై జిల్లా ఆరణి సమీపంలో ఆలయ వేడుకలకు సీరియల్ లైట్లు అమర్చుతున్న 18 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. కాట్టుకానల్లూర్ గంగైఅమ్మన్ ఆలయ మండల అభిషేక ఉత్సవాల సందర్భంగా ఆలయం చుట్టూ పందిళ్లు వేసి, అమ్మవారి నమూనాను విద్యుత్ లైట్లతో ఏర్పాటుచేసే పనులను అదే గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ సెల్వకుమార్ చేపట్టాడు. ఈ నేపథ్యంలో, సీరియల్ లైట్లు వేసే సమయంలో పైన వెళ్తున్న హై ఓల్టేజీ విద్యుత్ వైరు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అతను ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



వేలూరు, సెప్టెంబరు 2: గుడియాత్తం డివిజన్ మేల్‌అలత్తూర్ ప్రాంతంలోని ఓ హోటల్ మద్యం విక్ర యిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. గుడియాత్తం సీఐ పార్థసారథి నేతృత్వంలో పోలీసులు సోమవారం ఉదయం ఆ హోటల్ లో తనిఖీలు చేసి 70సీసాల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై హోటల్‌యజమాని సతీష్‌కుమార్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

చిత్రజ్యోతి

అజిత్ సరసన మళ్ళీ త్రిష!



అగ్రహీరో అజిత్ కుమార్ సరసన హీరోయిన్ త్రిష మళ్ళీ జతకట్టనున్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో 'జి', 'మంగాత్తా', 'ఎన్నై అరిందాల్' వంటి చిత్రాలు సూపర్ హిట్‌గా నిలిచాయి. ప్రస్తుతం 'విడాముయర్చి' చిత్రంలో అజిత్ సరసన నటిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తుంది. ఇదిలావుంటే, ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో హీరో అజిత్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాలో నటిస్తున్నారు. ఇందులో హీరోయిన్‌ను ఇంకా ఎంపిక చేయలేదు. ఈ నేపథ్యంలో ఈ మూవీ కోసం త్రిషను తీసుకోగా, ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. త్వరలోనే అజిత్ - త్రిష కాంబినేషన్‌లో తెరకెక్కించే సన్నివేశాలను షూట్ చేసేలా దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్ ప్లాన్ చేస్తున్నారు.

సినిమాకు నిర్మాతే నిజమైన హీరో

● సీనియర్ నటుడు అర్జున్

ఒక చిత్రానికి నిజమైన హీరో నిర్మాతేనని సీనియర్ నటుడు అర్జున్ అన్నారు. సినిమా కథపై ఉన్న అపారమైన నమ్మకంతో నిర్మాత కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తారని, అందువల్ల ఆయనే నిజమైన హీరో అన్నారు. ధ్రువ సర్జా, వైభవి శాండిల్య, అన్వేషీ జైన్ తదితరులు నటించిన చిత్రం 'మార్టిన్'. ఎపీ అర్జున్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి నటుడు అర్జున్ కథ సమకూర్చారు. ఉదయ్ కె కుమార్, సూరజ్ ఉదయ్ మెహతా భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ చిత్రానికి సంబంధించి మీడియా సమావేశం ఆదివారం నగరంలో జరిగింది. ఇందులో అర్జున్ మాట్లాడుతూ, 'ధ్రువ సర్జాను కోలీవుడ్‌కు పరిచయం చేయడం సంతోషంగా ఉంది. ఇందులో నేను ద్విపాత్రాభినయం చేశారు. ఇది ధ్రువ 50వ చిత్రం. ప్రతి సినిమా బ్లాక్‌బస్టర్ హిట్. ఆయనకు భారీ ఫ్యాన్‌బేస్ ఉంది. అలాంటి హీరో కోసం ఎలాంటి కథలు రాయాలనుకున్నానో బాగా ఆలోచించి ఈ కథ రాశాను. నటి వైభవి శాండిల్యకు శుభాకాంక్షలు, ఈ సినిమాను 13 భాషల్లో డబ్ చేశారు. ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ఈ సినిమా నచ్చుతుంది. ఆ మేరకు యాక్షన్, ఎమోషనల్ ఉంది. డిఫరెంట్ స్క్రీన్ ప్లే. ఎందరో విదేశీ ఆర్టిస్టులు నటించారు. హీరో ధ్రువ సర్జా మాట్లాడుతూ, 'తమిళంలో ఇది నాకు రెండో చిత్రం. నా తొలి చిత్రం 'సెమ్మ తిమిరు'క మంచి స్పందన లభించింది. 'మార్టిన్'కు కూడా అంతకంటే ఎక్కువ ఆదరణ లభిస్తుందని భావిస్తున్నాను. వచ్చే నెల 11న విడుదల చేయనున్నాం' అని పేర్కొన్నారు.



మీడియా సమావేశంలో 'మార్టిన్' చిత్ర బృందం

కార్తీశ్వరన్ హీరోగా 'నిర్వాకం పొరుప్పల్ల'

'పేయ్ ఇరుక్క భయమేల్' అనే చిత్రానికి దర్శకత్వం వహించిన సి.కార్తీశ్వరన్ హీరోగా నటించి దర్శకత్వం వహించిన చిత్రం 'నిర్వాగం పొరుప్పల్ల'. ఆర్కే డ్రీమ్ ఫ్యాక్టరీ బ్యానరుపై డి.రాధాకృష్ణన్ నిర్మాణంలో కేఎంపీ ప్రొడక్షన్స్ ఎం.భవనేశ్వరన్, ఎస్ఎంటీ స్టూడియోస్ షాజు సి సంయుక్తంగా ఈ సినిమా నిర్మించారు. ఇందులో హీరో కార్తీశ్వరన్‌తో పాటు ప్రధాన పాత్రల్లో సీనియర్ నటుడు లివింగ్‌స్టన్, ఇమాన్ అన్నాచ్చి, బ్లాక్ పాండి, ఆదవన్, అహల్య వెంకటేశన్, శ్రీనిధ్, కోడై సంతానం, ఎంఆర్ ఆర్జునన్ తదితరులు పోషించారు. ఈ సినిమా వివరాలను దర్శకుడు వివరిస్తూ, ప్రజలను ఎలా మోసం చేస్తున్నారో, డబ్బుల వసూలు ఎలా చేస్తున్నారో బహిర్గతం చేసేలా డార్క్ కామెడీ జోనర్‌లో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. చెన్నై, ముంబై, కాశ్మీర్ కుళుమణాలి, బెంగుళూరు, కేరళ తదితర రాష్ట్రాల్లో షూటింగ్ పూర్తి చేసి తుది దశ నిర్మాణ పనులు చేస్తున్నాం. విజయదశమిని పురస్కరించుకుని అక్టోబరు 10వ తేదీన విడుదల చేస్తున్నాం' అని తెలిపారు.



'నిర్వాకం పొరుప్పల్ల'లో ఓ దృశ్యం

ఆ కమిషన్ గురించి ఏమీ అడగొద్దు : ఆండ్రియా

మలయాళ చిత్రపరిశ్రమలో అవకాశాల పేరుతో 'అడ్జెస్ట్‌మెంట్'పై జస్టిస్ హేమ కమిషన్ ఇచ్చిన నివేదికపై తనను ప్రశ్నించవద్దంటూ సింగర్, హీరోయిన్ ఆండ్రియా జెర్మయ్య స్పష్టంచేశారు. తిరువాన్మియూరులో కొత్తగా ఏర్పాటు చేసిన 'సెక్రటాస్'ను ఆమె తాజాగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెను మీడియా జస్టిస్ హేమ కమిషన్‌పై ప్రశ్నలు సంధించింది. దీనికి ఆమె సమాధానమిస్తూ, చిత్రపరిశ్రమలో మహిళల లైంగిక వేధింపులపై జస్టిస్ హేమ కమిషన్ ఇచ్చిన నివేదికపై నో కామెంట్స్, ఈ అంశంలో ఎలాంటి ప్రశ్నలు అడగొద్దు' అంటూ కోరారు. నిజానికి ప్రతి అంశంలో ఎంతో బోల్డ్‌గా స్పందించే నటి ఆండ్రియా.. జస్టిస్ హేమ కమిషన్‌పై మాట్లాడేందుకు నిరాకరించడం ఇపుడు చర్చనీయాంశంగా మారింది. కాగా, ఎన్నో మంచి కంపెనీలకు చెందిన ఉత్పత్తులు ఉన్న ఈ షాపును ప్రారంభించడం సంతోషంగా ఉంది' అని వ్యాఖ్యానించారు.



శ్రీదేవి ముత్తాలమ్మన్‌కు విశేషపూజలు

ప్యారీస్, సెప్టెంబరు 2: స్థానిక థౌజండ్ లైట్స్ రామకృష్ణాపురంలోని శ్రీదేవి ముత్తాలమ్మన్ ఆలయ 74వ వార్షిక ఆడి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం భక్తులు పాల కలశాలలో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పూజారులు ప్రత్యేక అభిషేక ఆరాధనలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా అన్నాడీఎంకే ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డా.వి.సునీల్ పాల్గొని, భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకులు పి.చిన్నయ్య, బి.మనోహరన్, మారి, మణికంఠన్, సురేష్, తిరుమలైరాజన్ తదితరులు సునీల్‌ను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.





భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ అనంతరం డా.సునీల్‌ను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

నేనూ బాధితురాలినే: నటి కస్తూరి

అడయార్, సెప్టెంబరు 2: చిత్రపరిశ్రమలో తనకు కూడా లైంగిక వేధింపులు ఎదురయ్యాయని సీనియర్ నటి కస్తూరి అన్నారు. మలయాళంలో జస్టిస్ హేమ కమిషన్ ఇండస్ట్రీలోని క్యాస్టింగ్ కౌచ్ అంశంపై ఒక నివేదిక ఇచ్చింది. ఇది చిత్రపరిశ్రమంలో సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో పలువురు బాధిత నటీమణులు తమ అనుభవాలను బహిర్గతం చేస్తున్నారు. వారిలో నటి కస్తూరి కూడా చేరారు. ఒక ప్రముఖ దర్శకుడు ఓ హీరోయిన్ తొలి షాట్ ఒకే చేసేందుకు మూడు రోజుల పాటు తిప్పలు పెట్టి, ఆ తర్వాత ఆమె తొలి రోజు నటించిన షాట్‌ను ఒకే చేస్తారన్నారు. తనకు కూడా ఇలాంటి అనుభవం ఎదురైందన్నారు. తాను ఆయన మాట వినకపోవడంతో ఏకంగా మూడు చిత్రాల నుంచి తొలగించారని తెలిపారు. అదేవిధంగా ఒక హీరోతో కూడా ఇలాంటి చేదు అనుభవం ఎదురైందన్నారు. అయితే, ఒక్క చిత్రపరిశ్రమలోనే కాకుండా, ప్రతిచోటా ఈ తరహా వేధింపులున్నాయని ఆమె వ్యాఖ్యానించారు.

మాస్ సేవలు ప్రశంసనీయం

● ప్రతిభ పురస్కార వేడుకల్లో వక్తలు

ప్యారీస్, సెప్టెంబరు 2: స్థానిక పెరంబూర్‌లోని డీఆర్‌బీసీసీ మహోన్నత పాఠశాల ప్రాంగణంలో మద్రాస్ ఆది ఆంధ్ర అరుంధతీయ ఆదివాసీ సంక్షేమ సంఘం (మాస్) 32వ ప్రతిభా పురస్కారాలు-2024 ప్రదానోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కూనూరు మాధవరావు ప్రార్థనా గీతం, జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వేడుకలకు ప్రముఖ శాస్త్రవేత్త, మాస్ అధ్యక్షులు డా.కొల్లి రాజు సారథ్యం వహించి, డా.అంబేద్కర్, మాస్ వ్యవస్థాపకులు గోపాలకృష్ణ చిత్రపటాలకు అతిథులతో కలసి నివాళులర్పించారు. ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి హజరత్తయ్య మాస్ తరఫున నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. ముందుగా కొల్లి రాజు మాట్లాడుతూ 1992వ సంవత్సరం మాజీ ఐపీఎస్ అధికారి కేజీ గోపాలకృష్ణ ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల జీవనశైలి మెరుగుపరచాలన్న సంకల్పంతో మాస్ సంస్థ స్థాపించారని తెలిపారు. 32 ఏళ్లుగా టెన్త్, ప్లస్ టూ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పలువురు దాతల సహకారం, మాస్ సభ్యుల సమష్టికృషితో నగదు బహుమతి అందజేసి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రతిభ పురస్కారాల కోసం చెరుకూరి నాగార్జున-మహేశ్వరి దంపతులు, జి.ఆల్బర్ట్‌రావ్ సహా పలువురు ఆర్థికసాయం అందజేశారని తెలిపారు. మొత్తం 60 మంది విద్యార్థినీ, విద్యార్థులకు నగదు బహుమతిగా రూ.1.20 లక్షలు అందజేసినట్లు తెలిపారు. అనంతరం ముఖ్యఅతిథి ఇన్‌కమ్‌టాక్స్ అడిషినల్ కమిషన్ డా.వి.శ్రీధర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తమ తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న కష్టాలు దృష్టిలో ఉంచుకొని శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. విశిష్ట అతిథి, పారిశ్రామికవేత్త నర్రావుల వెంకటరమణ, గౌరవ అతిథులు శ్రీ పెరుంబుదూర్ జేపీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ డా.ఎమ్మెస్ విజయరావు, తమిళనాడు ప్రభుత్వ అదనపు కార్యదర్శి జీసీ నాగూర్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఒ.జానకిరామన్, తమిళనాడు అస్త్రానమి అండ్ సైన్స్ అధికారి కె.ఎళిలన్, మాజీ ఐఆర్ఎస్ అధికారి టీవీ అనీల్‌కుమార్, మాస్ సలహాదారులు గుడిమెట్ల చెన్నయ్య తదితరులు మాస్ సేవలను కొనియాడారు. కోశాధికారి ఎం.వీరయ్య, జాయింట్ సెక్రటరీ కేపీ రావు, సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్న ఈ కార్యక్రమం ఉపాధ్యక్షులు నూనె శ్రీనివాసులు వందన సమర్పణతో ముగిసింది.



విద్యార్థులకు నగదు పురస్కారం అందజేస్తున్న ఐటీ అధికారి శ్రీధర్, నర్రావుల వెంకటరమణ



త్రిప్లికేన్ విద్యార్థులతో కలిసి కార్ రేస్ తిలకిస్తున్న మంత్రి

ఫార్ములా 4 కార్ రేస్ విజయవంతం

● మంత్రి ఉదయనిధి

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఫార్ములా 4 కార్ రేస్ విజయవంతంగా నిర్వహించడం తమకెంతో గర్వకారణంగా ఉందని రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి అన్నారు. ఐలాండ్ గ్రౌండ్స్ మైదానంలో అంతర్జాతీయ స్థాయిలో ఈ పోటీలను నిర్వహించడం ప్రేక్షకులకే కాక నగరవాసులందరికీ ఆనందాన్ని కలిగించిదని, టీవీల్లో, నగరంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లపై ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించారన్నారు. ఇప్పటి వరకు ప్రపంచ స్థాయిలో ఐదునగరాల్లోనే 'నైట్ రేస్' జరిగిందని, చెన్నై నగరంలో నైట్ రేస్ జరుపటం ఇదే ప్రప్రథమమని చెప్పారు. సింగపూరు, మియామీ, లాస్‌వేగాస్, మొనాకో, అజర్‌బైజాన్ వంటి నగరాల్లో మాత్రమే జరిగిన స్ట్రీట్ సర్క్యూట్ రేస్‌ను రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిర్వహించడంతో రాజధాని చెన్నై నగర కీర్తి ప్రపంచమంతా వ్యాపించిందని ఉదయనిధి తన ఎక్స్‌పేజీలో ఓ సందేశం కూడా పోస్టు చచేశారు. ఈ ఫార్ములా -4 కార్ రేస్ రాష్ట్ర క్రీడా చరిత్రలో ఓ మైలు రాయి లాంటిందని తెలిపారు. ఈ పోటీలను దగ్గరగా చూడాలని ఆశపడిన తన నియోజకవర్గంలోని ట్రిప్లికేన్ ప్రాంతాలకు చెందిన వందమంది విద్యార్థినీ విద్యార్థుల కోర్కెను తానే దగ్గరుండి నెరవేర్చానని తెలిపారు.

వినాయకుడికి కరెన్సీ నోట్లతో అలంకరణ



పెరంబూర్, సెప్టెంబరు 2: కుంభకోణం మడత్తు వీధి భగవత్ వినాయక ఆలయంలో నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకల్లో నాలుగో రోజు వినాయకుడిని రూ.6 లక్షల విలువైన కరెన్సీతో ప్రత్యేక అలంకరణ చేయగా, కుబేర రూపంలో స్వామివారు దర్శనమిస్తున్నట్లు కనిపించింది. ఈ ఆలయంలో నిర్వహించే వినాయక చవితి వేడుకల్లో పొరుగు జిల్లాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటుంటారు.

తూత్తుకుడి హార్బర్ చేరుకున్న 'సింధు కేసరి'



వావూసీ హార్బర్‌లో జలంతర్గామి

పెరంబూర్, సెప్టెంబరు 2: భారత తీర రక్షణ దళానికి చెందిన 'సింధు కేసరి' అనే జలాంతర్గామి తూత్తుకుడి వావూసీ హార్బర్ చేరుకుంది. 2,442 టన్నుల బరువున్న ఈ నౌక, ఈ నెల 6వ తేది వరకు హార్బర్‌లో ఉంటుంది. ఈ గస్తీ నౌన, 21 రోజులకు ఒకసారి సమీపంలోని హార్బర్‌కు చేరుకొని, అక్కడ నౌకకు అవసరమైన ఇంధనం, అందులో ఉండే సిబ్బందికి అవసరమైన ఆహారం సమకూర్చుకొని తిరిగి వెళ్తుందని అధికారులు తెలిపారు.

స్టెమ్‌సెల్ చికిత్సపై అవగాహన పెరగాలి



ప్రత్యేక బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సినీ దర్శకుడు పాండ్యరాజన్

ప్యారీస్, సెప్టెంబరు 2: స్టెమ్‌సెల్ చికిత్సపై అవగాహన పెరగాలని ఇండియన్ అసోసియేషన్ ఫర్ టెక్నాలజీ ఛైర్మెన్ డా.పి.కామరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక వడపళనిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా వైద్యరంగంలో ప్రతి రోజు ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వస్తున్నాయని, అందులో స్టెమ్‌సెల్ (మూలకణాలు) థెరపీ ప్రమాదకర వ్యాధుల నుంచి దూరం చేస్తుందని తెలిపారు. ఈ నెల 4వ తేది నుంచి 8వ తేది వరకు వడపళనిలో ఉన్న డా.కామరాజ్ ఆసుపత్రి ప్రాంగణంలో స్టెమ్ సెల్ అవగాహన దినోత్సవం సందర్భంగా ప్రదర్శన ఏర్పాటుచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ ప్రదర్శనను ఉచితంగా సందర్శించవచ్చన్నారు. డీఎంకే ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్ ఈ ప్రదర్శన ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక సావనీర్‌ను సినీ దర్శకుడు పాండ్యరాజన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డా.జయరాణి, డా.నివేదిత తదితరులు పాల్గొన్నారు.

రసరమ్యం... సుధిక్ష అరంగేట్రం

ప్యారీస్, సెప్టెంబరు 2: స్థానిక చెట్‌పెట్‌లోని చిన్మయ హెరిటేజ్ సెంటర్ తపోవన హాలులో అభినయ నాట్యాలయ విద్యార్థిని పసుమర్తి సుధిక్ష భరతనాట్య అరంగేట్రం అలరించింది. ఆదివారం సాయంత్రం 7 గంటలకు నటరాజస్వామి, విఘ్నేశ్వరుడు, అష్ట దిక్కులను కీర్తిస్తూ గంభీర నొట్టి రాగంతో ఆలపించిన పుష్పాంజలి కీర్తనతో ప్రారంభమైన నాట్య ప్రదర్శన ప్రజాదరణ పొందిన పలు కీర్తనలతో రసరమ్యంగా సాగి, థిల్లానాతో ముగిసింది. అభినయ నాట్యాలయ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.సుమతి సుందర్ సమక్షంలో సుధిక్ష భరతనాట్య అరంగేట్రం చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ కళలు, సంస్కృతి శాఖ డిప్యూటీ డైరెక్టర్ హేమనాథన్, భరతనాట్య కళాక్షేత్ర ట్రస్ట్ ప్రొఫెసర్ కె.మోహన్‌లు సుధిక్షకు అభినయ శిరోణ్మని నాట్య తారగై పురస్కారం అందజేసి అభినందించారు. ఈమె నృత్యానికి సుమతి సుందరి నట్టువాంగం, శారద (గాత్రం), మృదంగంపై వి.వసంతరాజా, పీకే కామేశ్వరన్ (ఫ్లూట్), రాజీ (నాదస్వరం), కె.మణికంఠన్ (డోలు), ఎన్.మహేష్ (స్పెషల్ ఎఫెక్ట్స్)తో వాద్య సహకారం అందించారు. నగరంలో స్థిరపడిన తెలుగు ప్రముఖులు పసుమర్తి కామేష్‌బాబు-లీలారాణి దంపతుల కుమార్తె సుధిక్ష మొగప్పేర్‌లోని ఈ-నారాయణ పాఠశాలలో ప్లస్ వన్ చదువుకుంటోంది. ఈమె తన నాలుగో ఏట నుంచే సుమతి సుందర్ వద్ద భరతనాట్యం శిక్షణ పొందుతూ అంచెలంచెలుగా ఎదిగి అరంగేట్రం చేసి పలువురి ప్రశంసలు అందుకుంది. అంతేకాకుండా ప్రసిద్ధిచెందిన 200లకు పైగా ఆలయాల్లో కూడా ఉత్సవ రోజుల్లో భరతనాట్యం ప్రదర్శనలు ఇచ్చింది.





అంబత్తూరు జోన్, పాడికుప్పం పుదునగర్ కాల్వలో రోబోటిక్ మల్టీ పర్పస్ ఎక్సకవేటర్‌తో పూడికతీత పనులను జెండా ఊపి ప్రారంభిస్తున్న మేయర్ ప్రియ

నేత్ర వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

● ఎంజీఆర్ మెడికల్ వర్సిటీ వీసీ డా.కె నారాయణసామి

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నేత్ర వైద్యరంగంలో కృత్రిమ మేధోపరిజ్ఞానం, టెలీ ఆప్టోమెట్రీ ఇలా విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ మెడికల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.నారాయణసామి అన్నారు. పోరూరులోని శ్రీరామచంద్ర వైద్య విశ్వవిద్యాలయంలో ఆప్టోమెట్రిక్ అసోసియేషన్ ఆఫ్ తమిళ్ నన్బరగళ్ (ఓఏటీఎన్) సహకారంతో నేత్ర చికిత్సా విధానాలపై ఏర్పాటైన రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఈ సదస్సుకు 1300 మంది ప్రతినిధులు హాజరయ్యారు. నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన నేత్ర వైద్యనిపుణులను ఈ సదస్సులో సత్కరించారు. శ్రీరామచంద్రా వైద్య విశ్వవిద్యాలయం ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ మహేష్ వాకమూడి, ఆప్తమాలజీ ఆప్టోమెట్రీ విభాగాధిపతి డాక్టర్ రాధా అన్నామలై, ఓఏటీఎన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఆర్.కుమరన్, అధ్యక్షులు ప్రీతా రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణసామికి ప్రశంసాపత్రం అందజేస్తున్న శ్రీరామచంద్ర వైద్య విశ్వవిద్యాలయం ప్రొ వైస్ ఛాన్సలర్ మహేష్

టక్కర్ బాబా విద్యాలయానికి సీయూబీ కంప్యూటర్ ల్యాబ్ వితరణ

ప్యారీస్, సెప్టెంబరు 2: స్థానిక టి.నగర్‌లోని టక్కర్ బాబా విద్యాలయ సమితికి సిటీ యూనియన్ బ్యాంక్ (సీయూబీ) సమకూర్చిన కంప్యూటర్ ల్యాబ్‌ను సీఎం కార్యదర్శి డా.ఎమ్మెస్ షణ్ముగం సోమవారం ప్రారంభించారు. సీయూబీ ఛైర్మెన్ జి.మహాలింగం, జనరల్ మేనేజర్ జి.శంకర్, సమితి ప్రెసిడెంట్ డా.ఎస్.పాండ్యన్, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఆర్.శంకరనారాయణన్, కార్యదర్శి మారుతి తదితరులు పాల్గొన్నారు. పేద విద్యార్థులకు కంప్యూటర్‌పై ఉచిత శిక్షణ తరగతులు నేర్పనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో షణ్ముగం, సీయూబీ అధికారులు

వీఐటీ- ఏఆర్‌ఏసీటీ మధ్య అవగాహనా ఒప్పందం

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయం - అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన అమరరాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ (ఏఆర్ఏసీటీ) మధ్య అవగాహ నా ఒప్పందం జరిగింది. వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎస్వీ కోటరెడ్డి, అమరరాజా సీటీవో ఎం.జగదీష్ ఈ ఒప్పంద పత్రాలపై సంత కాలు చేశారు. ఆవిష్కరణలను అభివృద్ధి చేయడం, జ్ఞాన బదిలీ సులభతరం చేయడం, శ్రామికశక్తి అభివృద్ధి లక్ష్యంగా ఐదేళ్ల సహకారాన్ని ఈ ఒప్పందం సూచించింది.



ఒప్పంద కార్యక్రమంలో ప్రముఖులు

ఘనంగా ఎక్స్‌ప్రెస్ మాల్ వార్షికోత్సవం

అడయార్, సెప్టెంబరు 2: చెన్నై మహానగరంలోని ఎక్స్‌ప్రెస్ అవెన్యూ మాల్ 14వ వార్షికోత్సవాన్ని జరుపుకుంది. ఇందులో భాగంగా గత నెల 30వ తేదీ నుంచి ఈ నెల 1వ తేదీ వరకు మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించింది. ఆ తర్వాత 'ఈఏ' అవార్డులను ప్రదానం చేసింది. ఈ మైలురాయి సందర్భంగా రిటైలర్లు, షాపు యజమానులకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కవిత సింఘానియా ధన్యవాదాలు తెలిపారు. ఎక్స్‌ప్రెస్ అవెన్యూ మరో అద్భుతమైన సంవత్సరం కోసం ఎదురు చూస్తుందని, ప్రత్యేకమైన అనుభూతులతో ఈ ప్రయాణంలో భాగమైన తమ విలువైన దుకాణారులకు ధన్యవాదాలు అని పేర్కొన్నారు.



ఎక్స్‌ప్రెస్ అవెన్యూ వార్షికోత్సవ వేడుకల దృశ్యం